www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 14 | జూలై | 2026
పేజీలు : 8

## ఆరు నెలల్లో రెండు కోట్లు..!


(ఫైల్)

8 లో

- గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం
- 450 కేజీల గంజాయి స్వాధీనం
- 55 కేసులు 123 మంది అరెస్ట్
- సరిహద్దులు కట్టుదిట్టం..హైవేలపై నిరంతరం తనిఖీలు

## సమస్యలు పరిష్కరించకుంటే
# సమరమే..




- అంగన్వాడీలు కట్టుబానిసలు కాదు
- రూ.18 వేల గౌరవ వేతనం హామీ సిఎం నిలుపుకోవాలి
- అంగన్వాడీలతో ప్రభుత్వానికి పతనం తప్పదు
- ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసూఫ్
- కలెక్టరేట్ ముట్టడి విజయవంతం
- ముగిసిన అంగన్వాడీల పాదయాత్ర

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అంగన్వాడీల సహనాన్ని చేతకాని తనంగా భావించొద్దని, వారి సమస్యలను పరిష్కరించ కుండా కాలయాపన చేస్తే సమరం తప్పదని ఏఐటియూ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసూఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటియూసి అనుబంధన అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 2వ రోజు సోమవారం పాల్వంచ పెద్దమ్మ తల్లి ఆవరణ నుండి ప్రారంభమైంది. ఈ పాదయాత్రను ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన నాయకులు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం

మిగతా 2లో..

## ప్రభుత్వ ఉద్యోగులా..
## వడ్డీ వ్యాపారులా..!



- ఆరోపణలపై విచారణ జరిగేనా?
- నిబంధనలకు విరుద్ధమైతే కఠిన చర్యలు తప్పవు

**ప్రజాపక్షం/తల్లాడ:** ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత కలిగిన వర్గం. అయితే ఇటీవల ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు వ్యక్తిగతంగా అధిక వడ్డీకి డబ్బులు అప్పుగా ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ సేవా నియమాలకు విరుద్ధమయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగ చేసుకొని అధిక వడ్డీకి రుణాలు ఇవ్వడం వల్ల కుటుంబాలు అప్పుల ఊబిలో చిక్కుకునే ప్రమాదం ఉందని

మిగతా 2లో..

## సింగరేణిని కాపాడేందుకే తాడిచర్ల కేటాయింపు

మంత్రి కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి, కార్మికులను కాపాడేందుకే ఎటువంటి టెండర్ లేకుండా న్యాయపమైన చిక్కులు లేకుండా తాడిచర్ల 2 బొగ్గు బాయిని సింగరేణి సంస్థకు కేటాయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పభుత్వ హయాంలో బొగ్గు బావులను ఇష్టం వచ్చిన రీతిలో నచ్చిన వారికి కట్టబెట్టారని, దీంతో దాదాపు 2.61 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసి బొగ్గు బావులను రద్దు చేసి అవినీతికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయించిందని, బొగ్గుబావులను టెండర్ ద్వారానే కేటాయించాలని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. సింగరేణి సంస్థ ప్రస్తుత పరిస్థితి, కార్మికుల పడుతున్న కష్టాలు చూసి ఎలాగైనా సింగరేణిని కాపాడాలని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యే లు, బీఎంఎస్ నాయకులు కలిసి అనేక మార్లు ప్రధాని నరేంద్ర మోదీ ను కలిసి విన్నవించమని, తెలంగాణ ప్రజలపై, సింగరేణి పై ఉన్న ప్రేమతో, 11 సంవత్సరాల తర్వాత టెండర్ లేకుండా తాడి చర్ల 2 బొగ్గు బ్లాక్ కేటాయించిందని వివరించారు. తాడిచర్ల 2 లో గ్రేడ్ 8 నాణ్యమైన బొగ్గు లభిస్తుందని, ఈ బ్లాక్ తో వేలాది మందికి

మిగతా 2లో..

## సింగరేణిని అప్పుల ఊబిలోకి నెట్టారు..



- స్కాములపై విచారణ జరిపించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డివి పొంతన లేని మాటలు
- రాజ్యసభ బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు వద్దిరాజు రవిచంద్ర

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సింగరేణి సంస్థను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దానిని అప్పుల ఊబిలోకి నెట్టాయని బిఆర్ఎస్ రాజ్యసభ బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. సోమవారం ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్‌తో కలిసి మాట్లాడుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర ఓ డ్రామా అని ఆయన పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్‌ను కొత్తగా కేటాయించినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని ఇది ఎప్పుడో సింగరేణి గుర్తించి ఎన్నో ఏళ్ల క్రిందటే సాధించుకున్న బ్లాక్ అని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎన్నడు సింగరేణి మనుగడ కోసం

మిగతా 2లో..

# సమస్యలు పరిష్కరించకుంటే సమరమే..





(మొదటిపేజీ తరువాయి)

పాతపాల్వంచ, నవభారత్ మీదుగా కలెక్టరేట్ కు చేరుకుని వందలాది మందితో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిడబ్ల్యూఓ స్వర్ణలత లెనినకు అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ అంగన్వాడీలు కట్టు బానిసలు కాదని, చాలీచాలని వేతనాలు ఇస్తూ అధిక పనిభారంతో వెట్టి చాకిరీ చేయించుకోవాలనే ప్రభుత్వ వైఖరిని ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు. అంగన్వాడీలతో పెట్టుకున్న ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీలతో పెట్టుకున్న నాటి సిఎంలు చంద్రబాబు, కేసిఆర్‌లు గెద్ద దిగాల్సి వచ్చిందని, కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు రూ.18 వేల గౌరవ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని సిఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విమర్శించడం పాలకులకు తగదన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మాత శిశు సంరక్షణ, పౌష్టికాహార పంపిణి చిన్నారుల సంక్షేమంలో అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చేరవేస్తున్న అంగన్వాడీల శ్రమను గుర్తించకుండా వారిపై సంబంధం లేని అదనపు విధులను మోపడం దారుణం అన్నారు. కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించకుండా పని భారం పెంచడం శ్రమ దోపిడీనే అని ధ్వజమెత్తారు. న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని యూసుఫ్ డిమాండ్ చేశారు. రూ.18 వేల గౌ. వేతన హామీని అమలు చేడడంతో పాటు బిఎల్ఓ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని, పనిభారాని తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవచూపకుండా ఉద్యమాలను అణిచేయలాని సూస్తే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల ఆగ్రహాన్ని ప్రభుత్వం తక్కువ అంచనా వేయవద్దని, వారి పోరాడానికి ఏఐటియూసి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా సమర భేరి మోగిస్తామని యూసుఫ్ హెచ్చరించారు.

### ముగిసిన పాదయాత్ర...

సమస్యల పరిష్కారం కోసం ఏఐటియూసి అనుబంధ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం కలెక్టరేట్‌కు చేరుకోవడం ముగిసింది. దారిపొడవునా ఏఐటియూసి ఎర్రజెండాలు హోరెత్తించాయి. దీనితో రహదారులు అరుణ కాంతులీనాయి. సుమారు 40 కి.మీ మేరా నాయకులు, అంగన్వాడీలు పాదయాత్ర నిర్వహించారు. రెండురోజుల పాటు సాగిన పాదయాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పాల్వంచకు చేరుకున్న పాదయాత్రకు పాల్వంచ సిపిఐ నాయకులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి విశ్వేశ్వరరావుతో పాటు నాయకులు ఘన స్వాగతం పలికారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతామహాలక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటిప్రసాద్, అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, సాయి ఈశ్వరి, కరుణకుమారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి అరుణ, గోనె మణితో పాటు మున్నా లక్ష్మి కుమారి, వేల్పుల మల్లిఖార్జున్ రాజు షాహీన్, కైసర్, ధనలక్ష్మి, పద్మ, లక్ష్మి, ప్రమీల రాణి సరోజ పాల్గొన్నారు.

# సింగరేణిని అప్పల ఊబిలోకి నెట్టారు..

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడలేదని, కేంద్రం బలవంతంగా సింగరేణి బొగ్గు బావులను వేలానికి పెట్టినప్పుడు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి దగ్గరుండి టెండర్లు నిర్వహించారు తప్ప అడ్డుకోలేదన్నారు. సింగరేణిలో ఓబి టెండర్లు, డీజిల్ కొనుగోళ్లు, పేలుడు పదార్థాల కొనుగోళ్లు, సోలార్ ప్రాజెక్టులు, రికార్డులో మాత్రమే ఉన్న 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు వంటి అంశాలలో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై బిఆర్ఎస్ నాయకలు కేటిఆర్, హరీష్ రావు అధికారికంగా ఫిర్యాదు చేసినప్పటికీ కేంద్రం, సిబిఐ లేదా సెంట్రల్ విజిలెన్స్ విచారణకు ఆదేశించలేదని విమర్శించారు. 2015లో కేంద్ర ప్రభుత్వం ఎంఎండిఆర్ చట్టాన్ని సవరించి బొగ్గు బ్లాకులను తప్పనిసరిగా వేలం ద్వారా కేటాయించే విధానాన్ని తీసుకువచ్చి సింగరేణి ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కు లిగ్నైట్ మైన్‌లను నామినేషన్ పద్ధతిలో ఇస్తున్న కేంద్రం తెలంగాణలోని సింగరేణికి అదే విధానాన్ని ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో లాభాల్లో ఉన్న సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం కొద్ది నెలల్లోనే వేల కోట్ల ఓవర్ డ్రాఫ్ట్‌లోకి నెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణిలో స్కీములు లేవని స్కాములే జరుగుతున్నాయని విమర్శించారు. ఓబి టెండర్లలో ప్రత్యేక నిబంధనలు పెట్టి తమకు అనుకూల కాంట్రాక్టర్లకే పనులు అప్పగిస్తూ వందల కోట్ల అవినీతిని పాల్పడుతున్నారని వద్దిరాజు ఆరోపించారు. కార్మికుల మెడికల్ బోర్డులను నిలిపి వేయడం, కారుణ్య నియామకాలను అడ్డుకోవడం వల్ల వేలాది కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. బిఆర్ఎస్, టిజిబికెఎస్ ఉద్యమాలకు భయపడి తాడిచెర్ల 2 బ్లాక్ కేటాయింపును గొప్పగా ప్రచారం చేస్తున్నారని ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. సింగరేణిలో జరిగిన అన్ని అవినీతి ఆరోపణలపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కోయగూడెం 3, సత్తుపల్లి 3, శ్రావణ పల్లి, కెకెఆర్ బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో సింగరేణికి కేటాయించాలని వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు ఓపెన్ కాస్ట్ గనులకు వెంటనే పర్యావరణ, అటవీ అనుమతులు మంజూరు చేయాలని, నిలిచిపోయిన మెడికల్ బోర్డులు, కారుణ్య నియామకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు కాలువలు తవ్వి పంపులు పెట్టింది 90 శాతం కేసిఆర్ అని కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరపలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకట రమణ, పగడాల నాగరాజు, బెల్లం వేణు, లక్కినేని సురేందర్, దల్‌సింగ్, రవి, సతీష్, మురళీకృష్ణ, బొమ్మెర రామ్మూర్తి, తాజుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత కీలకం

**-జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి రామారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** నులిపురుగుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత కీలకమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని కాలవొడ్డు నయాబజార్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారి డాక్టర్ డి రామారావు మాట్లాడుతూ భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవడం, గోర్లు చిన్నగా ఉంచుకోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సురక్షితమైన తాగునీటిని మాత్రమే వినియోగించడం వంటి ఆరోగ్య అలవాట్లను ప్రతి విద్యార్థి పాటించాలని సూచించారు. జిల్లాలో సోమవారం సాయంత్రం 5 గంటల నాటికి 2,82,579 మంది చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయగా, ఇది 91 శాతం



లక్ష్యసాధన అని డిఎంహెచ్ఓ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లాలో టీకాల అధికారి డాక్టర్ ప్రతాప్ సంపత్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి నారాయణ, ఉప జిల్లా మాస్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా అధికారి కెవి రాజు, జిల్లా వ్యాక్సిన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజర్ రమణ, వైద్యాధికారి డాక్టర్ దేవిశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ జయపాల్, ఏఎన్ఎం శారద, టెక్నిషియన్ రామకృష్ణ, ఆర్‌బిఎస్‌కే వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, నాగమాధురి, హెచ్ఎం ఉషారాణి, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులా.. వడ్డీ వ్యాపారులా..!

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అత్యవసరాల కోసం అప్పు తీసుకున్నవారు నెలసరి వడ్డీల భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా ఉపాధ్యాయులు, చట్టాలని కాపాడాల్సిన అధికారులలో కొందరు తమ విధులను నిష్పాక్షికంగా నిర్వహించాల్సిన బాధ్యత కలిగి ఉన్నప్పుడు ఇటువంటి వడ్డీ వ్యాపారం చేపట్టడం చాలా బాధాకరం. వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు వారి అధికారిక విధులపై ప్రభావం చూపకూడదని సేవా నియమాలు సూచిస్తాయి. అందువల్ల ఇటువంటి ఫిర్యాధులు వస్తే సంబంధిత శాఖలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలు తేల్చాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అధికారిక అనుమతి లేకుండా లేదా చట్టాలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. అదే సమయంలో నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ఉద్యోగుల ప్రతిష్ట దెబ్బతినకుండా విచారణ పూర్తయ్యే వరకు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కూడా అభిప్రాయపడుతున్నారు. ప్రజలు అధిక వడ్డీ వేధింపులకు గురైతే సంబంధిత పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం లేదా ఇతర అధికారిక ఫిర్యాధు వ్యవస్థలను ఆశ్రయించి ఫిర్యాధు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. పారదర్శక విచారణలు, కఠిన చర్యలు, ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా ఇటువంటి సమస్యలను నియంత్రించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాసేవలో ఉన్న ప్రతీ ఉద్యోగి సేవా నియమాలను పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించినప్పుడే ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. కానీ కొందరు ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారాలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సింగరేణిని కాపాడేందుకే తాడిచర్ల కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆనాడు నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థ కు రూ. 600 కోట్ల రూపాయలను కేటాయించి నాటి ప్రధాని వాజపేయి ఆదుకుంటే, ప్రస్తుతం ప్రధాని మోదీ బొగ్గు బ్లాక్ కేటాయించి మరోసారి ఆదుకున్నారని అన్నారు. బీజేపీతోనే ఏదైనా సాధ్యమేనని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు, ఉద్యోగుల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి బీజేపీ చిత్తశుద్ధితో పనిచేస్తామని హామీ ఇచ్చారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ సింగరేణి నీ అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేసి సింగరేణిని భ్రష్టు పట్టించారని, కేవలం ఓటు బ్యాంకు గానే చూశారనీ, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ విధానాన్ని కొనసాగించి అవినీతిని కొనసాగించిందని విమర్శించారు. సింగరేణి భవిష్యత్ కోసం ఆలోచన చేయలేదని, బొగ్గుబ్లాక్ ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుకున్నాయని ఫలితంగా ప్రైవేట్ కంపెనీలు పోటీ పడి దక్కించుకు న్నాయన్నారు. ఇక ఒరిస్సా లోని నైనీ బ్లాక్ కోసం కాంగ్రెస్ మంత్రులు ఒకరికొకరు ఆరోపణలు చేసుకొని చివరకు బొగ్గు బ్లాక్ ను టెండర్ ప్రక్రియను రద్దు చేసారని, వారికి ఎంతసేపు సంపాదన, అవినీతి చేయడంలో పోటీ తప్ప కార్మికుల కోసం , సింగరేణి భవిష్యత్ కోసం ఆరాటపడలేదని మండిపడ్డారు. సంస్థ నిధులను ఒకరేమో సిద్దిపేట, గజ్వేల్ తరలించుకు పోతారని, సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ ఆడటానికి నిధులు ఉపయోగించుకుంటారని ఆరోపించారు. ఇష్టం వచ్చినట్టు సంస్థ నిధులను వినియోగించుకొని నష్టాలపాలు చేసి కార్మికుల చెమటచుక్కల ద్వారా సంపాదించిన కష్టాన్ని రెండు పార్టీలు వృధా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 49 శాతం వాట ఉన్న కేంద్ర ప్రభుత్వం సింగరేణిలో ఏనాడు జోక్యం చేసుకోలేదని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎంపీ డీ కే అరుణ, శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే లు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పటేల్, ఎమ్మెల్సీ లు మల్కా కొమరయ్య, అంజి రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ చెరుకు భాగ్య లక్ష్మి, రాష్ట్ర నాయకులు జీవీకే మనోహర్, జయ శ్రీ, డాక్టర్ వెంకన్న నాయక్, రవి నాయక్, బలగం శ్రీధర్, బీ ఎం ఎస్ జాతీయ కార్యదర్శి మాధవ నాయక్, మొగిలిపాక రవి కుమార్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణతో విద్యార్థులకు భరోసా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నులి పురుగుల నివారణతో విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్యకు భరోసా అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఆయన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 16వ విడత కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో 333136 మంది పిల్లలు, యువతకు ఆల్బెండాజోల్ మాత్రాలను జిల్లాలో పంపిణిని చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గి ఆరోగ్యవంతంగా తయారవుతారని చెప్పారు. ప్రతీ ఒక్క చిన్నారికి నులి పురుగుల మందులను వేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు వేయాలని సూచించారు. మాత్రలు తీసుకోని వారికి ఈనెల 20న నిర్వహించే మాప్ అప్ డే సందర్భంగా మాత్రలు ఇస్తారని చెప్పారు.



# అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు కల్పించాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట అన్నారు. సోమవారం ఆయన ఆకస్మికంగా వెంకటేశ్వరా కాలనీలో జరుగుతున్న సర్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఫారాల పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిఎల్‌ఓలతో మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ, స్వీకరణ చేయాలని, ఫారాలను పరిశీలించి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి సత్వర పరిష్కారాలు పొందాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని సబ్ కలెక్టర్ కోరారు. అధికారులు, బిఎల్‌ఓలు పూర్తిబాధ్యతతో విధులు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణను నిష్పక్షపాతంగా పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు డా।। పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ oలో జనాభా అధికంగా ఉన్నందున రెండవ రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన అమర్లపూడి వసంతరాణి తాను ఇంటర్ చేశానని ఖాళీగా ఉన్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్టు కొరకు దరఖాస్తు చేసుకోగా మెరిట్ లిస్టులో పేరు ఉన్న కూడా పోస్టు రాలేదని తనకు ఆ పోస్టు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. తల్లాడ మండలం గొల్ల గూడెం గ్రామానికి చెందిన జి. సురేష్ తన కుమారుడు గుండ్ల సాత్విక్ కు వైరా బిసి మహాత్మ జ్యోతిబా పూలే స్కూల్ నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన డి. ఉపేంద్ర తనకు బ్లాక్ ఫంగస్ వచ్చి కంటి చూపు పోయిందని తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును పొడిగించాలి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును పొడిగించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని 14, 15 డివిజన్ సిపిఐ శాఖ సమావేశం కొత్తగూడెంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో రావుల హన్మంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రజల్లో గందరగోళం నెలకొందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీతో పాటు వాటిని పూర్తి చేసేందుకు ప్రజలకు కూడా సరైన అవగాహన లేదన్నారు. బిఎల్ఓలు ఫారాల పంపిణీ సేకరణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఉన్న సందేహాలు నివృత్తి చేసి పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈనెల 24తో ఎస్ఐఆర్ కార్యక్రమ గడువు ముగియనుందని దానిని పొడిగించాలని కోరారు. 14, 15 డివిజన్లలో అధిక సంఖ్యలో పేదలు ఉన్నారని స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు, లేని వారికి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, కార్యదర్శి పోతురాజు వెంకటేశ్వర్లు, జంగాల వలరాజు, చాగంటి వెంకట నర్సయ్య, బుడిగె వెంకన్న, కొత్తగూడెం శాఖ సహాయ కార్యదర్శి మాకనబోయిన నాగేశ్వరరావు, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షులు పగడాల శ్రీనివాసరావు, ప్రసాద్, కర్రీ హుస్సేన్, రావుల సంజీవరావు, లక్క వీరయ్య, ఎస్కె పకీర్, బుడిగ ఉపేందర్, ఎస్కె మీరా పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయండి



**డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి యంగల ఆనందరావు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డి.హెచ్.పి.ఎస్ జిల్లా కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపునిచ్చారు. సోమవారం దళిత హక్కుల పోరాట సమితి సత్తుపల్లి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో మేడ్చల్మల్కాజ్గిరి జిల్లా నాగోల్ బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన సమితి ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి పది మంది ప్రతినిధులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ చేస్తూ దళిత, బడుగు బలహీన వర్గాలను విద్యకు, నాణ్యమైన వైద్య సేవలకు దూరం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. సామాజిక, రాజకీయ చైతన్యం పెంపొందించుకోవడానికి ఇలాంటి రాజకీయ శిక్షణ తరగతులు ఎంతో అవసరమని, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో డి.హెచ్.పి.ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి తడికమళ్ళ యోబు, జిల్లా కమిటీ సభ్యులు చిల్లి ముంత మధు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల నాయకులు చిల్లిముంత రవి, కోలేటి వెంకటేశ్వర్‌రావు, వెంకటరమణ, తడికమల్ల యశోద, కిన్నెర లక్ష్మి, ఆళ్లగట్ల జిగిరి తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యానికి భరోసా

**చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పిల్లల ఎదుగుదలకు నులి పురుగుల నివారణే కీలకమని, నులి పురుగులకు చెక్ పెట్టి, ఆరోగ్యవంతమైన బాల్యానికి అడుగు వేయాలన్నారు మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, అర్హులైన పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ నులి పురుగులు, పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, మానసిక వికాసం, చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత (అనీమియా), పోషకాహార లోపం, బలహీనత, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు ఇవ్వడం ద్వారా నులిపురుగులను సమర్థవంతంగా నివారించవచ్చని వివరించారు. ఈ మాత్ర పూర్తిగా సురక్షితమైనదని, ప్రభావవంతమైనదని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అవినాష్,కౌన్సిలర్లు , వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం. నాగరాజును జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజును కలెక్టర్ దివాకర టిఏస్ కలిసి పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ కమీషనర్



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామపంచాయతీలో జరుగుతున్న వివో బిల్డింగ్, డ్రైన్, ఇంకుడు గుంత నిర్మాణపనులతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లోని అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ డిప్యూటీ కమీషనర్ విద్యాలత సోమవారం పరిశీలించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటారు. పంచాయతీ రికార్డులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజ్ కు సంబందించిన అన్ని పనులను సకాలంలో నూరుశాతం పూర్తి చేయాని అన్నారు. విబిజిరామ్ పనులకు సంబందించి గ్రామాల్లో పనులు గుర్తించి ఎస్టిమేట్ వేసి త్వరగా శాంక్షన్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాసరావు, డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి విజయలక్ష్మి, ఎంపిడీఓ ఆర్ ఉపేంద్రయ్య, సర్పంచ్, పిఆర్ఏఈ, ఏపిఓ, ఈసీ, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లకు బాధ్యతలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో భర్తీ చేసిన ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లను సోమవారం బాధ్యతలు ఎంఇఓ బి.మురళీ మోహన్‌రావు అప్పగించారు. జమలాపురం ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ ఆయా పోస్టులకు జూన్ 10న ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆ ఇంటర్వ్యూలో జమలాపురం గ్రామానికి చెందిన ముష్వా స్వప్నకుమారి టీచరుగా, కందుకూరి పూజిత ఆయాగా సెలెక్ట్ అయ్యారు. వారు సోమవారం జమలాపురం పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. ఎంఇఓ మురళీమోహన్‌రావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యాబోధన చేయాలని ప్రీ ప్రైమరీ పాఠశాలలో వృత్తిపరంగా పూర్తి నిబంధనలతో పనిచేయాలని, చిన్నతనం నుండి చదువుపై ఇష్టం కలిగేలా బోధన చేయాలని సూచించారు.

## ఎఐవైఎఫ్ మండల మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/బోనకల్:** ఈ నెల 14 మండలంలోని కలకోట గ్రామంలో నిర్వహించే అఖిల భారత యువజన సమాఖ్య మండల మహాసభను జయప్రదం చేయాలని మండల కన్వీనర్ జక్కుల నిఖిల్ ఓ ప్రకటనలో తెలిపారు. నేటి యువత నిరుద్యోగం, ఉద్యోగాల కొరత, ప్రైవేటీకరణ, పెరుగుతున్న విద్యాఖర్చులు, సామాజిక అసమానతలు వంటి అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. యువత ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎఐవైఎఫ్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. మండల మహాసభలో గత కాలంలో చేపట్టిన ఉద్యమాలను సమీక్షించడంతో పాటు రానున్న కాలంలో చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, విద్యారంగాన్ని బలోపేతం చేయడం, క్రీడలకు ప్రోత్సాహం, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి అంశాలపై ప్రత్యేక తీర్మానాలు ఆమోదించే అవకాశం ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువత, విద్యార్థులు, మహిళా యువత, ఎఐవైఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభకు జిల్లా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు.

## వాన కోసం కప్పతో చిన్నారుల ఊరేగింపు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు సకాలంలో పెరుగుదల లేక పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లి గ్రామంలో కొంతమంది చిన్నారులు చేసిన ప్రయత్నం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. గతంలో వర్షాలు కురవాలని కోరుతూ పల్లెల్లో ప్రత్యేక ఆచారాలు నిర్వహించేవారు. వాన దేవుడిని ప్రార్థిస్తూ పాటలు పాడటం, చిన్న పిల్లలు కప్పను కర్రకు కట్టి ఊరంతా ఊరేగిస్తూ ఇంటింటా నీళ్లు పోయించి పూజలు చేయించడం వంటి సంప్రదాయాలు గ్రామీణ జీవనంలో ఒక భాగంగా ఉండేవి. కాలక్రమేణా ఆ ఆచారాలు కనుమరుగవుతున్న తరుణంలో మళ్లీ అలాంటి దృశ్యం కనిపించడం గ్రామస్తుల్లో ఆసక్తిని రేకెత్తించింది. గ్రామంలో వర్షాలు పడక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన చిన్నారులు కప్పను ఒక కర్రకు కట్టి ఇద్దరు పట్టుకుని, నృత్యాలు చేస్తూ తీసుకుని ఊరంతా తిరుగుతూ వాన కోసం ప్రార్థించారు. వారి అమాయకత్వం, వానపై ఉన్న ఆశ గ్రామస్తులను కదిలించింది. చిన్నారుల ఈ ప్రయత్నం ఫలించి త్వరలో మంచి వర్షాలు కురవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## వీవోఏలకు రూ 18వేల వేతనం చెల్లించాలి


**-ప్రభుత్వ హామీలు అమలు చేయాలని ధర్నా**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఐకేపీ వీవోఏలకు ప్రభుత్వం ప్రకటించిన రూ 18వేల వేతనాన్ని వెంటనే అమలు చేయాలని ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనుకు నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం వెలుగు మండల సమైక్య కార్యాలయం వద్ద వీవోఏలు ధర్నా నిర్వహించి, అనంతరం ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో వీవోఏలు గత 25 సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ కనీస వేతనాలు అందడం లేదని, పనిభారం పెరుగుతున్నా వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు కుమారి, శ్యాంబాబు, వెంకటేష్, లక్ష్మి, నాగమణి, సూర్యకుమారి, మంగ, వేణి, మనీ, నాగేశ్వరరావు, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ఇల్లందు కుసుమ సంపత్‌కు గిన్నిస్ రికార్డు

**-అభినందించిన ఎస్పీ**




**ప్రజాపక్షం/ఇల్లందు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన కరాటే క్రీడాకారుడు కుసుమ సంపత్ అరుదైన ఘనత సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అతి పెద్ద కరాటే ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో తన పేరును నమోదు చేసుకున్నారు. మొత్తం 1,212 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్న ఈ భారీ ప్రదర్శనలో కుసుమ సంపత్ భాగస్వామ్యం కావడం ద్వారా జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఈసందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజ్ సంపత్‌ను అభినందించి, గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేశారు. క్రీడా రంగంలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాలకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కుసుమ సంపత్ సాధించిన ఈ ఘనత పట్ల ఇల్లందు ప్రాంత ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## కడారి వెంకటేష్‌కు ఘన సత్కారం

**-రెండు దశాబ్దాల నృత్య సేవకు దక్కిన గౌరవం**



**ప్రజాపక్షం/ఇల్లందు:** నృత్య కళారంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఇల్లందుకు చెందిన సీనియర్ డాన్స్ మాస్టర్ కడారి వెంకటేష్ ప్రతిష్ఠాత్మక కళా మహోత్సవం అవార్డు అందుకున్నారు. కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కళా మహోత్సవం కార్యక్రమంలో ప్రముఖుల సమక్షంలో నిర్వాహకులు డాక్టర్ కళ్యాణ్ సుమిత్ర ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు యాదవ్, ఆదివాసీ నాయకుడు ఆరం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గత 21 సంవత్సరాలుగా నృత్యరంగానికి సేవలందిస్తున్న కడారి వెంకటేష్ ఈటీవీ, జెమినీ టీవీ కార్యక్రమాల ద్వారా కళా ప్రయాణాన్ని ప్రారంభించి, సినీ రంగంలోనే తన ప్రతిభను చాటుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో పాల్గొని బహుమతి సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారు. ప్రస్తుతం వెంకట్ డాన్స్ అకాడమీ ద్వారా యువ కళాకారులకు శిక్షణ అందిస్తూ, నృత్య పోటీల నిర్వహణతో పాటు కళారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కడారి వెంకటేష్‌కు అవార్డు రావడం పట్ల నృత్య కళాకారులు శ్రీకాంత్ మాస్టర్, సాయి మాస్టర్, శేఖర్ మాస్టర్, రాజేష్ మాస్టర్, అరుణ్ మాస్టర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగుల నివారణ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బి వెంకటేశ్వర్లు వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జూలూరుపాడు ఆధ్వర్యంలో పద్మజ హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన మండల కేంద్రంలోని (కేజీబీవీ) ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గి, వారి ఆరోగ్యం, ఎదుగుదల మరియు విద్యాభ్యాసం మెరుగుపడతాయని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన బాలబాలికకు ఆల్బెండజోల్ మాత్ర అందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని తెలియపరిచారు. టార్గెట్ పిల్లలు (లబ్ధిదారులు) 10,556 కి గాను సోమవారం జూలూరుపాడు మండలంలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్సరంలోపు పిల్లలకు (లబ్ధిదారులు) 8,719 మందికి మాత్రలు అందించడం జరిగింది. మిగిలిన వారికి ఎవరికైతే మాత్రలు అందలేదో వారికి రేపటి నుండి మాపప్ డే 20 వ తారీకు వరకు అందరికీ అందించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరండ్ల శ్రీనివాస్, కె రాధిక, కె ప్రియదర్శిని హెల్త్ సూపర్వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కేజీబీవీ హాస్టల్ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గాడి తప్పుతున్న ప్రభుత్వ విద్య..!

**- రేకుల షెడ్డులో ప్రాథమిక పాఠశాల, ప్రీ ప్రైమరీ ప్రాథమిక పాఠశాల నిర్వహణ**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో ప్రభుత్వ విద్య గాడి తప్పుతోంది. అధికారుల ఆలసత్వమే దీనంతటికి కారణం. ఒక టీచర్ ఒక విద్యార్థి ఉన్న చోట ప్రాథమిక పాఠశాలల పక్కా బిల్డింగులు 20మంది విద్యార్థులు ఉన్న చోట రేకుల షెడ్‌లో ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే పటిష్టమైన విద్య వ్యవస్థను నెలకొల్పి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయల ఖర్చు చేస్తుంటే తిరుమలాయపాలెం మండలంలో ఆచరణలో అది సాధ్యం కావటం లేదు. మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామపంచాయతీ గోపాలపురంలో 2000 సంవత్సరంలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల బిల్డింగ్ శిథిలావస్థకు చేరడంతో కొంతకాలం అద్దె గదుల్లో విద్యార్థులకు పాఠాలు బోధించగా అద్దె భవనం వారు ఖాళీ చేయించడంతో చేసేది ఏమి లేక అంగన్వాడీ కేంద్రం వెనకాల రేకుల షెడ్‌ను అక్కడే విధులు నిర్వహిస్తున్న టీచర్ ఇందిరా సొంత నిధులతో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి రేకుల షెడ్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంది. మొత్తం పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉండగా దాంట్లోనే ప్రీ ప్రైమరీకి సంబంధించిన విద్యార్థులు 5గురు ఉన్నారు. పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మొత్తం పదిమంది చిన్నారులు ఉండగా దానిలో నుండి 5గురు ప్రీ ప్రైమరీకి వెళ్లారని అంగన్వాడీ కేంద్రంలో 5గురు పిల్లలు ఉన్నారని అక్కడ టీచర్ రాజమ్మ తెలిపారు. ప్రీ ప్రైమరీలో విద్యార్థులకు ఇంగ్లీష్ నేర్పించవలసిన ఇన్స్ట్రక్టర్ జోగుపర్తి సాధ్విని రిజైన్ చేయగా అక్కడే ప్రీ ప్రైమరీ ఆయాగా విధులు నిర్వహిస్తున్న కళ్యాణి పిల్లలకు ఇంగ్లీష్ నేర్పిస్తుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా గోపాలపురం ప్రాథమిక పాఠశాలకు పక్కా బిల్డింగ్‌ను నిర్మించాలని స్థానిక మాజీ సర్పంచ్ గడ్డి కొప్పుల రాజు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధించడం.. సింగరేణి సంస్థ భవిష్యత్తును మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక విజయం

**మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్**



**ప్రజాపక్షం/మణుగూరు:** తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధించడం మణుగూరు ఏరియాతో పాటు సింగరేణి సంస్థ భవిష్యత్తును మరింత బలోపేతం చేసే చారిత్రాత్మక విజయమని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పేర్కొన్నారు. మణుగూరు ఏరియాలోని పీకేఓసీ2 సైట్ ఆఫీస్‌లో తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధన విజయోత్సవాలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ విజయం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి, సంస్థ యాజమాన్యం కృషి, కార్మికుల విశ్వాసానికి ప్రతీక అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ భద్రత, నాణ్యత, ఉత్పాదకతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని, సమష్టి కృషితో సింగరేణిని దేశంలోనే ఆదర్శవంతమైన, సుస్థిరమైన బొగ్గు ఉత్పత్తి సంస్థగా మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దాదాపు 13 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు లభించడం సింగరేణి చరిత్రలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా ఆయన అభివర్ణించారు. 2013 లో కేటాయించిన ఈ బ్లాక్‌కు గతంలో మైనింగ్ లీజు లభించక విలువైన సంవత్సరాలు వృథా అయ్యాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయం, ప్రత్యేక చొరవతో ఈ మైనింగ్ లీజును సాధించారని వివరించారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని అనంతరం తాడిచర్ల2 బ్లాక్ లీజు సాధించడం సింగరేణి విస్తరణ, అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. తాడిచర్ల2 బొగ్గు గని సింగరేణిలోనే అతిపెద్ద బొగ్గు గనిగా అవతరించనుందని ఆయన తెలిపారు. 18.75 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన ఈ బ్లాక్‌లో సుమారు 434 మిలియన్ టన్నుల భౌగోళిక బొగ్గు నిల్వలు ఉండగా, అందులో 340 మిలియన్ టన్నుల నిల్వలు వెలికితీతకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఈ గని ద్వారా ప్రతి సంవత్సరం సుమారు 6 మిలియన్ టన్నుల జీ9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయవచ్చని, దాదాపు 45 సంవత్సరాల పాటు నిరంతరాయంగా బొగ్గు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందన్నారు. ఈ నూతన బ్లాక్ ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పారిశ్రామికాభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు రూ.2,500 కోట్ల టర్నోవర్ సాధించే సామర్థ్యంతో సింగరేణి ఆర్థిక బలోపేతానికి ఈ గని దోహదపడుతుందని పేర్కొన్నారు. తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధన విజయాన్ని పురస్కరించుకుని అన్ని గనులు, విభాగాల్లో విజయోత్సవాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే పీకేఓసీ2లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పరస్పరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి పికేఓసా అండ్ ఎస్ఓ టు జిఎం డి. వెంకట రామారావు, ఏరియా అధికార ప్రతినిధి అండ్ ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్, ఏజీఎం (ఐఈ) సి.హెచ్. రాంబాబు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ వి. మధన్ నాయక్, ఆయా విభాగాల/గనులు ఉన్నత అధికారులు, అధికారులు, పికేఓస్2 ఉద్యోగులు, జీఎం కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేకు శ్రీకారం


**-దుమ్ముగూడెంలో ఆధునిక సాంకేతికతతో భూ కొలతలు**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమం దుమ్ముగూడెం మండలంలో సోమవారం ప్రారంభమైంది. మండలంలోని వెంకటరామపురం రెవెన్యూ గ్రామంలో తహసీల్దార్ ఎం అశోక్‌కుమార్ రీ సర్వే పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల హద్దులపై ఉన్న వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రైతులకు స్పష్టమైన, పారదర్శకమైన భూ రికార్డులు అందించడమే రీ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. తొలిదశలో మండలంలోని వెంకటరామపురం, గుర్రాలబైలు సంఘం, లింగాపురం, ములకనపల్లి తదితర ఐదు రెవెన్యూ గ్రామాలను రీ సర్వే కోసం ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డీజీపీఎస్ ద్వారా అక్షాంశాలు, రేఖాంశాలను నమోదు చేసి, ల్యాండ్ పార్సిల్ మెజర్మెంట్లతో భూముల కొలతలు చేపడుతున్నారు. దీని ద్వారా కచ్చితమైన భూ హద్దులను గుర్తించి భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రీ సర్వే పూర్తయిన అనంతరం భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులు, మ్యాప్‌లను తయారు చేసి రైతులకు అందజేయనున్నట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలోసర్వేయర్‌నవ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాణాపురానికి బలమైన భరోసా..!

**-సమాజానికి ఆదర్శంగా నిలిచిన భాస్కర్‌రెడ్డి**
**-బాణా డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం**









**ప్రజాపక్షం/ముదిగొండ:** "తాను ఎదిగిన నేలకు తిరిగి ఏదైనా చేయాలి" అనే ఆలోచనతో ముందుకు వచ్చిన వారు చాలా అరుదు. అలాంటి అరుదైన వ్యక్తుల్లో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఆవుల భాస్కర్‌రెడ్డి ఒకరు. దేశంలో ఉన్నత పదవిలో సేవలందించిన ఆయన, పదవీ విరమణ తర్వాత తన జన్మ గ్రామమైన ముదిగొండ మండలం బాణాపురం అభివృద్ధినే జీవిత ధ్యేయంగా ఎంచుకున్నారు. ఆ సంకల్పమే బాణా డెవలప్‌మెంట్ ఫౌండేషన్ రూపంలో నేడు వేలాది మందికి ఆశాకిరణంగా నిలిచింది. గత పదేళ్లుగా ఈ ఫౌండేషన్ గ్రామీణ అభివృద్ధికి కొత్త నిర్వచనం చెబుతోంది. ప్రభుత్వాలపై మాత్రమే ఆధారపడకుండా, సమాజం కూడా తన బాధ్యతను గుర్తిస్తే ఒక గ్రామం ఎంతవేగంగా అభివృద్ధి చెందుతుందో బాణాపురం నిరూపిస్తోంది. విద్య, వైద్యం, త్రాగునీరు, విద్యార్థుల సంక్షేమం, పేద కుటుంబాలకు చేయూత, సామాజిక మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక రంగాల్లో ఫౌండేషన్ అందిస్తున్న సేవలు గ్రామ ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకొచ్చాయి. 2016లో అపోలో టెలిహెల్త్ సేవలను ప్రారంభించడం ద్వారా గ్రామ ప్రజలకు నిపుణుల వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామంలోనే ఆధునిక వైద్యసలహాలు లభించడం వల్ల అనేక కుటుంబాలకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు మెరుగైన ఆరోగ్యసేవలు అందుతున్నాయి. అదే సంవత్సరం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం గ్రామ ఆరోగ్య పరిరక్షణలో కీలక మైలురాయిగా నిలిచింది. విద్యాభివృద్ధి కోసం కూడా ఫౌండేషన్ విశేష కృషి చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, షెడ్లు వంటి మౌళిక వసతులు కల్పించి విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించింది. గ్రామీణ విద్యార్థులు కూడా పట్టణ విద్యార్థులతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకునేలా చర్యలు చేపట్టింది. 2021లో నిర్మించిన కళావేదిక గ్రామ ప్రజలకు ఒక విలువైన ఆస్తిగా మారింది. సామాజిక, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలను కేంద్రంగా నిలుస్తున్న ఈ వేదిక గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఫౌండేషన్‌లో సేవల్లో అత్యంత విశిష్టమైన కార్యక్రమం ఆవుల అమ్మిరెడ్డి స్మారక స్కాలర్‌షిప్‌లు ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2020 నుంచి పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 150 మంది విద్యార్థులకు రూ. 42.74 లక్షలకు పైగా ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఎన్నో కుటుంబాల్లో ఉన్నత విద్యపై ఆశలు చిగురించాయి. ఇటీవలే మరో 105 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం ఫౌండేషన్ విద్యాపట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం. అంతేకాకుండా తల్లిదండ్రులు లేని చిన్నారులకు గత ఐదేళ్లుగా నెలకు రూ.2 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడం, పదో తరగతి అనంతరం ఇంటర్, డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థులకు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉన్నత విద్యకు అండగా నిలుస్తున్నారు. ఈ సేవల వల్ల అనేక కుటుంబాల్లో విద్యపై ఆశలు చిగురించగా ఎంతోమంది విద్యార్థులకు తమ కలలను సహకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. సేవ అంటే కేవలం విరాళాలు ఇవ్వడం కాదని, సమాజంలో శాశ్వత మార్పు తీసుకురావడమే నిజమైన సేవ అని బాణా డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిరూపిస్తోంది. గ్రామంలో పుట్టిన వ్యక్తి తన గ్రామానికి తిరిగి సేవ చేయాలనే ఆలోచనతో చేపడుతున్న కార్యక్రమాలు బాణాపురాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్నాయని గ్రామ పెద్దలు, ప్రజలు గర్వంగా చెబుతున్నారు. నేడు బాణాపురం పేరు వినగానే అభివృద్ధి, విద్య, సేవ, మానవత్వం గుర్తుకొస్తున్నాయి. ఒక వ్యక్తి సంకల్పం...ఒక సంస్థ సేవా భావం... ఒక గ్రామ భవిష్యత్‌ను ఎలా మార్చగలవో చెప్పే స్ఫూర్తిదాయక గాథగా బాణ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ నిలిచింది.

## మా భూముల్లో తవ్విన కాలువ నీళ్లు మాకెందుకు రావు..?

**-సీతారామ ప్రాజెక్టు కాలువ వద్ద రైతుల నిరసన**
**-గేట్వాల్ ఏర్పాటు చేసి సాగు నీరు అందించాలని డిమాండ్**



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** మా భూములను ఇచ్చి సీతారామ ఎత్తిపోతల పథకం కాలువ నిర్మించాం..కానీ ఆ కాలువలో ప్రవహించే నీరు మాత్రం మా పొలాలకు రాకపోవడం అన్యాయం అంటూ చంద్రుగొండ మండల రైతులు ప్రభుత్వాన్ని నిలదీశారు. మండలంలోని మద్దుకూరు గ్రామ శివారులో ఉన్న సీతారామ ప్రాజెక్టు పంట కాలువ వద్ద సోమవారం రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ చంద్రుగొండ మండలం మీదుగా ప్రవహిస్తున్న సీతారామ ప్రాజెక్టు కాలువ నీటిని స్థానిక రైతులకు అందించకపోవడం బాధాకరమన్నారు. గోదావరి జలాలు కళ్లముందే ప్రవహిస్తున్నా, మండలంలోని వేల ఎకరాల వ్యవసాయ భూములు నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కాలువ వద్ద శాశ్వతంగా గేట్వాల్ ఏర్పాటు చేయాలని, అది సాధ్యం కాకపోతే తాత్కాలికంగా బుంగ ఏర్పాటు చేసి కాలువ నీటిని చెరువులు, కుంటల్లోకి మళ్లించాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో మద్దుకూరు ప్రాంతంతో పాటు పరిసర గ్రామాల్లోని సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు. తమ జిల్లా మీదుగా, తమ భూముల మధ్యగా వెళ్తున్న కాలువ నీటిపై మొదటి హక్కు స్థానిక రైతులకే ఉండాలని స్పష్టం చేశారు. మండల రైతుల సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు, అత్యవసరంగా పరిగణించి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అయ్యన్నపాలెం, చంద్రుగొండ, మద్దుకూరు, దామరచర్ల, రావికంపాడు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** చుంచుపల్లి మండలం, పెనగడప పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాలయాల్లోని విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ క్రమంలో ప్రశాంతినగర్ గ్రామపంచాయతీలోని మహాత్మా జ్యోతిబా పూలే బాయ్స్ స్కూల్ నందు నిర్వహించిన కార్యక్రమంలో పెనగడప పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.హరీష్ పాల్గొని నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పెనగడప పరిధిలో మొత్తం 6979 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించగా, 6752 మంది విద్యార్థులకు విజయవంతంగా మాత్రలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.హరీష్, ప్రశాంతినగర్ ఉప సర్పంచ్ ఈ.స్వప్న, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, హెచ్‌వీ.భద్రమ్మ, ఏఎన్ఎం మంజులతోపాటు ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జెడ్‌పిహెచ్ఎస్ ఆల్లపల్లి, కేజీబీవీ హాస్టల్‌లో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, సరైన చేతులు కడుక్కునే విధానంపై విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సెర్ఫ్ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రభుత్వ ఆదేశాల మేరకు సెర్ఫ్ అధికారులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన మిరపకాయలకు మూడు నెలలు గడిచినా రైతులకు చెల్లింపులు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గానుగపాడు గ్రామానికి చెందిన రైతు ఇంజం అప్పారావు విక్రయించిన 55 క్వింటాళ్ల మిరపకాయలకు సంబంధించిన సుమారు రూ 5లక్షలు ఇప్పటికీ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సారి వారం రోజుల్లో చెల్లిస్తామని చెప్పి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. చంద్రుగొండ మండలంలో మరికొందరు రైతులు కూడా చెల్లింపులు అందక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు వెంటనే బకాయిలు విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సచిన్ ఆధ్వర్యంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు మాత్రలు వేయించారు. పర్ణశాల జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంతో పాటు మండల వ్యాప్తంగా మొత్తం 4,533 మంది పిల్లలకు గాను 4,373 మందికి ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ఈకార్యక్రమంలో పీహెచ్ఎన్ వెంకట నర్సయ్య, హెచ్‌వీ అమ్మాజీ, హెచ్ఏ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

## ములకపాడులో పారిశుద్ధ్య పనులు ముమ్మరం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మండల పరిధిలోని ములకపాడు గ్రామ పంచాయితీలో సీజనల్ వ్యాధుల ప్రభావాన్ని నివారించే లక్ష్యంతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ తులసమ్మ ఆదేశాల మేరకు గ్రామంలోని పలు ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి శానిటేషన్ పనులు ప్రారంభించారు. పనులను సర్పంచ్ తులసమ్మ, ఉప సర్పంచ్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వారు తెలిపారు.

## పాలేరులో ఎన్‌డీఆర్ఎఫ్ వరదలపై అవగాహన



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో వరదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలపై గ్రామస్తులకు ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కూసుమంచి తహసీల్ధార్ సైదులు, ఎంపీడీవో జస్వంత్‌కుమార్, ఎస్ఐ నాగరాజు, సర్పంచ్ నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి, ఆర్ఐ జ్యోతి, జీపీవో పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ దినోత్సవం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగపేట వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. మండలంలో మొత్తం 9,700 మంది పిల్లలు ఉండగా, తొలి రోజు 8,700మందికి మాత్రలు వేయించారు. మిగిలిన పిల్లలకు ఈనెల 20న మాప్‌అప్‌డే సందర్భంగా మాత్రలు అందించనున్నారు. ఈకార్యక్రమంలో 71 మంది ఆశా కార్యకర్తలు, 11 మంది ఏఎన్ఎంలు, 7 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 90 మంది అంగన్‌వాడీ సిబ్బంది, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎల్‌నినో ప్రభావంతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వాలు ప్రోత్సాహక ద్వారా ఎకరానికి రూ 8000 లు ఆర్థిక సహాయం కింద ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం పిలుపుమేరకు సోమవారం కొణిజర్ల మండల రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలోపాల్గొని మాట్లాడారు. వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించి చట్టబద్ధంగా చేయడం ద్వారా వ్యవసాయరంగం బలోపేతం కాగలదని పేర్కొన్నారు. పంటసాగుకు సరిపడా అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అతి తక్కువ వర్షాలకు వేసిన పంటలు 30 శాతం మొలకెత్తిన మొక్కలను కాపాడుకోవడానికి వర్షాలు లేక పోవడంతో రైతులు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లా సీతారామప్రాజెక్టుద్వారా సాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, రైతుసంఘం మండల అధ్యక్షుడు దేరంగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి ఉపేందర్, పుట్టా సత్యనారాయణ, చింతల ఆదినారాయణ; అడపా కృష్ణయ్య, దొబ్బనబోయిన శేషయ్య, యర్ర కేశవులు, తాతా బాబు తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేషన్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న కార్మికులకు సరైన సమయంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు రక్షణ పరికరాలు అందించాలని, కార్మికులకు ఇచ్చే 16 రకాల నిత్యావసర వస్తువులు, కార్మికులకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అసిస్టెంట్ కమిషనర్ ధర్నా చేపట్టిన కార్మికుల వద్దకు వచ్చి వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ హామీతో పారిశుధ్య కార్మికులు ఆందోళన విరమించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే మరల ఆందోళనకు దిగుతామని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సిఐటియు నాయకులు తుమ్మా విష్ణువర్ధన్, టియుసిఐ నాయకులు జి. రామయ్య, ఐఎన్‌టియుసి నాయకులు నరాల మోహన్, కార్మికులు పాల్గొన్నారు.

## రేపటి నిరుద్యోగ మహాధర్నాని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/తల్లాడ:** ఈనెల 15వ తేదీన సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ మహాధర్నాను నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సత్తెనపల్లి నరేశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రెండు కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, యువతీ, యువకులను మోసం చేస్తోందన్నారు. ఈ మేరకు నిరసనగా ఈనెల15న నిర్వహిస్తున్న నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం విజయవంతం చేయాలని, దీనికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) సంపూర్ణ మద్దతు తెలియజేసిందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, యువతకు ఇస్తామన్న నిరుద్యోగభృతి రూ.4వేలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా నూతన పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ప్రీ ప్రైమరీ పాఠశాలలో బోధనలు ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ఆరు పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రీ ప్రైమరీ బోధనలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని మర్లపాడు, కొత్త బోడి మల్లె, అంబేద్కర్ నగర్, నారాయణపురం, చిన్న కోరుకొండి, కల్లూరు లలో ఆరు పాఠశాలలలో ఇన్స్ట్రక్టర్ ఆయాలు మొత్తం 12 మంది ఎంపికై విధుల్లో చేరినట్లు ఎంఈఓ పొదిల పద్మ తెలిపారు. గత నెలలో మండల కమిటీ తహశీల్దార్ బ్రహ్మేశ్వరరావు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి.4 సంవత్సరముల నుంచి ఐదు సంవత్సరాలు లోపు చిన్నపిల్లల కు విద్యాబోధన చేయనున్నట్లు పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో గల 33/11 సబ్‌స్టేషన్‌పరిధిలోని 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా గుర్రాలపాడు, తెల్దారుపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### నులిపురుగుల నివారణకు మందు గోలీలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రైవేటు మరియు ప్రభుత్వ ప్రైవేటు జూ నియర్ డిగ్రీ కళాశాలలో 15,500 మందికి విద్యార్థిని విద్యార్థులకు 60 కేంద్రాలలో ఆశా, అంగన్వాడి, ఏఎన్ఎం, వైద్యులు వారి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మందు మాత్రలను వేశారు. ఈ సందర్భంగా వైద్యులు నవ్య కాంత్ , తబస్సుమ్ సాకేత్ విద్యార్థిని విద్యార్థుల కు ప్రత్యేకంగా అవగాహన కల్పించి నులిపురుగుల నివారణకు సదస్సులను నిర్వహించారు. ఎదిగే పిల్లలకు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా ప్రతి సంవత్సరం ఆల్బెండజోల్ మందు గోలీలను వేసుకోవాలని అవగాహన కల్పించారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా అందించారు. నులి పురుగుల నివారణ చేస్తే శారీర కంగా దృఢంగా ఉంటారని చురుకుగా ఉంటారని వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు లోని మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి లు వార్డుల్లో కౌన్సిలర్లు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో సర్పంచులు ప్రారంభించారు.

### సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం కొత్తగూడెం తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సవరణ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఓలు అందించే ఫారాలు ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఫారాలు పూరించే క్రమంలో అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ ప్రక్రియ నిర్దేశితగడువులోగా పూర్తి కావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పుల్లయ్య మాట్లాడుతూ కొత్తగూడెం పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటి పర్యవేక్షణకు ఏడుగురు బిఎల్ఓలు, సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన ఎస్‌బిఐటి విద్యార్థి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రపంచ వ్యాప్తం గా ఘనతను సాధించిన వ్యక్తులు, విశేషాలను ప్రచురించే ప్రఖ్యాత పుస్తకం గిన్నిస్ వరల్డ్ రికార్డు లో ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ తృతీయ సంవత్సరం విద్యార్థి భూపతి స్థానం సాధించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ సోమవారం తెలిపారు. గత నెల హైదరాబాద్‌లో విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, జెఆర్ ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ సంయుక్తంగా 1212 మంది సభ్యులతో అతి పెద్ద ప్రదర్శన నిర్వహించారు. సుమారు 40 నిమిషాల నిడివి గల కటాస్ ప్రదర్శనను కేవలం 20 నిమిషాల్లోనే తమ కళాశాల విద్యార్థి భూపతి ప్రదర్శించి పూర్తి చేసినందుకు ప్రముఖ ప్రశంసలు అందుకోవడంతో పాటు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి, వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. భూపతి తండ్రి కరాటే మాస్టర్ అని ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ తెలిపారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషిస్తారని ఆయన తెలిపారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధ్యమేనని తమ కళాశాల విద్యార్థి భూపతి నిరూపించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. గిన్నిస్ రికార్డుల్లో స్థానం సాధించిన భూపతిని కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవివి శివప్రసాద్, ఈఈఈ విభాగాధిపతి టి. చరణ్‌సింగ్ పాల్గొన్నారు.

## వల్లభిలో అగ్నిప్రమాదం..తప్పిన పెను ప్రమాదం



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని వల్లభి గ్రామంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యేసు శంకర్ బాబు నివాసంలో పిండివంటలు తయారు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కళాయికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడి ఇంటిలోకి వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో అతని భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంటలను గమనించిన వారు వెంటనే అప్రమత్తమై ఇంటి నుంచి బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే అగ్ని ప్రమాదంలో ఇంట్లోని కొన్ని గృహోపకరణాలు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానికులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

### గోదావరి జలాల విడుదలపై తుమ్మలకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/తల్లాడ:** తెలంగాణ రైతు సంఘం సూచన మేర కు తల్లాడ మండలంలోని సుమారు 20వేల ఎకరాల సాగుకు సిరిపురం మేజర్ ద్వారా గోదావరి జలాలను విడుదల చేసి రైతులకు భరోసా కల్పించిన రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యు లు తుమ్మల నాగేశ్వర రావు, ఇరిగేషన్ అధికారులకు తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రైతుల అవసరాలను గుర్తించి సకాలంలో సాగునీటిని అందుబాటులోకి తీసుకురావడంతో వేలాది ఎకరాల్లో పంటల సాగుకు ఊతం లభించిందని తెలిపారు. భవిష్యత్‌లోనూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సరఫరాను నిరంతరంగా కొనసాగించాలని మండల కమిటీ కోరింది.

### అన్నదానానికి రూ. 27,126 విరాళం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఇల్లందు రోడ్డు కైకొండాయిగూడెం స్టేజీ వద్ద గల విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి రూ.27,126 విరాళంగా అందించారు. సోమవారం శ్రీ సాయి మణికంఠ ఎలక్ట్రికల్ సర్వీసెస్ బాధ్యులు దాసరి ఉమామహేశ్వరరావు రేణుక దంపతులు ప్రతి సోమవారం ఆలయంలో నిర్వహించే అన్నదానానికి రూ.27,126 విరాళంగా కమిటీ వారికి అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు ఉమామహేశ్వరరావు రేణుక దంపతులను శాలువతో సత్కరించారు. పూజా కార్యక్రమాలతో అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో జరిగిన ప్రజావాణికి హాజరైన ఆయన జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులపై ఉన్న నమ్మకంతో ప్రజలు వినతులు అందిస్తుంటారని, వాటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై వెంటనే సమగ్ర నివేదికలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

### అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన గిరిజన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ పిఓ రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. అర్హులైన ప్రతీ గిరిజనులకు దశలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ యూనిట్ల అధికారులు డేవిడ్ రాజు, అరుణ కుమారితో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సాధన కోసం అంగన్‌వాడీల పాదయాత్ర

**- పెద్దమ్మతల్లి దేవస్థానం నుండి ప్రారంభం**
**- పాదయాత్రను ప్రారంభించిన ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసూఫ్**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం అగదని ఏఐటియుసి రాష్ట్ర అద్యక్షులు ఎండి. యూసూఫ్ అన్నారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 18,000/ల వేతనంతో పాటుగా పలు సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శులు నరాటి ప్రసాద్, సింగు నరసింహరావుల నేతృత్వంలో మండల పరిధి పెద్దమ్మతల్లి దేవస్థానం నుండి కలెక్టరేట్ వరకు రెండవ రోజు చేపట్టిన పాదయాత్రను రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసూఫ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమసయంలో అంగన్‌వాడీలకు నెలకు 18 వేయిల వేతనంతో పాటుగా ఐసిడిఎస్‌కు సరిపడా బడ్జెట్ కేటాయించాలని, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 20,000/లు చెల్లించాలంటూ, ఫ్రీ ప్రైమరీ పాఠశాలలకు పిల్లలను బలవంతంగా పంపించే విధానాన్ని వెంటనే నిలిపివేయాలనే తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం భారీ ఎత్తున కదిలి వచ్చిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్‌తో సాగిన పాదయాత్ర కేశవాపురం నుండి పాల్వంచ బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొన్నది. పాదయాత్రకు పాల్వంచ సిపిఐ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, ఉప్పుశెట్టి రాహుల్, 44వ, డివిజన్ కార్పోరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళలుర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు నరసింహరావు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఈశ్వరి, కరుణ కుమారి, రాష్ట్ర డిప్యూటి జనరల్ సెక్రటరి సీతామహాలక్ష్మి, యూనియన్ జిల్లా అద్యక్ష, కార్యదర్శులురెడ్డి అరుణ, గోనె మణి, ముప్వా లక్ష్మి కుమారి, కంచర్ల జమలయ్య, మల్లిఖార్జున్, ఖైసర్, షాహిన్, పద్మ, లక్ష్మి, పద్మ, సరోజ, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎమిలీ, ఎక్సలెంట్ పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో





**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధన అమలును పరిశీలించేందుకు మండల విద్యాశాఖ అధికారి(ఎంఈవో) వీరస్వామి సోమవారం అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్, ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలల గుర్తింపు పత్రాలు, విద్యార్థుల అడ్మిషన్ రిజిస్టర్లు, హాజరు నమోదులు, విద్యా రికార్డులు, మౌలిక వసతులు, తరగతి గదుల నిర్వహణ, పారిశుద్ధ్యం, ఆటస్థలం, బోధన సిబ్బంది అర్హతలు, ప్రభుత్వ నిబంధనల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల యాజమాన్యాలతో సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై వివరణలు కోరారు. పాఠశాలకు సంబంధించిన బోధన సిబ్బంది వివరాలు, విద్యార్థుల సంఖ్య, ఫీజు నిర్మాణం, టైమ్ టేబుల్, పీరియడ్ ప్రణాళిక, గుర్తింపు వివరాలు తదితర సమాచారాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా నోటీసు బోర్డుపై తప్పని సరిగా ప్రదర్శించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల విద్యార్హతల ధ్రువపత్రాలను పరిశీలించిన ఎంఈవో, బోధన సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల ప్రభుత్వం నిర్దేశించిన విద్యా ప్రమాణాలు, భద్రతా నిబంధనలు, పరిపాలనా మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు సురక్షితమైన, క్రమ శిక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రతి విద్యా సంస్థ బాధ్యత అని ఎంఈవో వీరస్వామి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో, సిఆర్పి రమాదేవి పాల్గొన్నారు.

# 20వ వార్డులో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ




**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో పరిధిలోని 20వ వార్డులో ఉన్న మేరీ ఇమాక్యులేట్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు, 20వ వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి, భర్త వుండ్రు శ్యామ్ బాబు పాల్గొని విద్యార్థులకు స్వయంగా మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా వుండ్రు శ్యామ్‌బాబు మాట్లాడుతూ నులిపురుగుల సమస్య, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వాటి నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే ప్రభుత్వం చేపడుతున్న నులిపురుగుల నివారణ కార్యక్రమాలను తల్లిలండ్రులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్త నవీన, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాజెక్టులపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** సీతారామ, మారెళ్ల పాడు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలు నిరాధారమని కాంగ్రెస్ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్టుకు సరైన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయడంతో రైతులకు సాగునీరు అందే పరిస్థితి ఏర్పడిందన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేసేందుకు పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టులపై రాజకీయాలు చేయకుండా రైతుల ప్రయోజనాల కోసం సహకరించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి భిక్షమ్మయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, తూము వీరరాఘవులు, సర్పంచులు మచ్చా నరసింహారావు, సబ్కా పిచ్చయ్య, గాదె వెంకటరెడ్డి, బారాజు సంపత్, మానాది వెంకన్న, సామకూరి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఉచిత న్యాయ సలహాలను సద్వినియోగం చేసుకోవాలని పారా లీగల్ వాలంటీర్ కొలిపాక నాగమణి సూచించారు. మండలం లోని తిరుమలాపురం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారా లీగల్ వాలంటీర్స్ మూడో రోజు సోమవారం గ్రామంలో ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ఎన్నో చట్టాలు ఉన్నాయని అన్నారు. వాటి గురించి వివరించేందుకు పారా లీగల్ వాలంటీర్ ఆద్వర్యంలో ఉచిత న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వారం రోజుల పాటు గ్రామంలో క్షేత స్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల గురించి తెలుసుకుని వారికి ఉచిత న్యాయ సలహాలు అందించేందుకు పారా లీగల్ వాలంటీర్స్ నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్స్ కిషన్ రావు, యం.నాగమణి, పి.సుశీల, నాగేంద్ర, పద్మావతి, కె.నాగమణి, కె.నాగేంద్ర, ఉదయ్, నాగలక్ష్మి, రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులపై సత్వరమే పరిష్కారం




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రీవెన్స్ లో అందిన దరఖాస్తు లపై ఆయా శాఖల అధికారుల సత్వరమే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. స్థానిక తహశీల్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. మండలం లోని వివిధ గ్రామాల నుంచి భూ సమస్యలు, పంచాయతీరాజ్ వివిధ శాఖలకు చెందిన " దరఖాస్తులు,అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రీవెన్స్ లో అందిన దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రీవెన్స్ కు అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. మండలంలో జరుగుతున్న సర్ కార్యక్రమం లో అందరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించేలా పని చేయండి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ విద్య పై నమ్మకం కలిగేలా పని చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. ఫ్రీ ప్రైమరీ పాఠశాల కు ఎంపికైన టీచర్లు, ఆయా లకు జాయినింగ్ ఆర్డర్స్ ను అందించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో ఆరుగురు టీచర్లు, ఆరుగురు ఆయా లకు నియామకపు ఉత్తర్వలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్య ను బలోపేతం చేసేందుకు ఫ్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అందులో పని చేసేందుకు మీరు భాగస్వామ్యులు కావటం అదృష్టం అన్నారు. నిబద్దతో చిన్నారులకు విద్య ను అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆశయం ను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో, అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, సీఆర్పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగులను నులిపివేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** నులిపురుగుల ను నులిపి వేయాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్ కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థునులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 119 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించటం ద్వారా ఏకాగ్రత లోపం, రక్తహినత, శారీరక ఎదుగుదల లోపం వంటి అనేక సమస్యలను నివారించి, విద్యార్థుల మానసిక మరియు శారీరక ఆరోగ్యంను పెంపొందించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ యం.యర్రయ్య, సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

**ప్రజాపక్షం/దమ్మపేట:** రహదారిపై ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిలిపి ఉంచిన లారీ ప్రమాదానికి కారణమై ఓ యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఆదివారం రాత్రి సుమారు 11గంటల సమయంలో గంగులగూడెం గ్రామానికి చెందిన వంక కిషోర్(25)మేస్త్రీ పనులు చేసుకుంటే జీవనం సాగిస్తున్నాడు. కిషోర్ తన మోటార్ సైకిల్‌పై కురం కార్తీక్, వకం శివలతో కలిసి సత్తుపల్లికి వెళ్తుండగా రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న వంక కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న కురం కార్తీక్, వంక శివలకు రక్త స్రావంతో కూడిన గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లారీని భద్రతా సూచనలు, ముందస్తు జాగ్రత్తలు లేకుండా రహదారిపై నిలిపి ఉంచడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కారేపల్లి మండలంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కారేపల్లి హైస్కూల్, మోడల్ స్కూల్‌లలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ), మండల వైద్యాధికారి డాక్టర్ బి సురేష్ పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, లలిత, అనిత, దేవ కరుణ, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి భరోసాయాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గుగునుల శాఖా మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం ఇల్లెందు క్రాస్ రోడ్ లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన పూల మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరుపున స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై స్వల్పంగా చర్చించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరు నెలల్లో రెండు కోట్లు..!



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : యువతను బానిసలుగా మారుస్తున్న గంజాయిపై జిల్లా పోలీసులు ఉక్కు పాదం మోపారు. గంజాయి విక్రయాలు..రవాణాను కట్టడి చేసేందుకు అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు హైవేలపై వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయి తరలిస్తూ వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తూ తమదైన గుర్తింపు చాటుకుంటున్నారు ఖమ్మం పోలీసులు. ఇటీవల డిజిపి ఖమ్మం సందర్శించిన సమయంలో ఒక సందర్భంలో గంజాయి పెక్లర్ల కన్నా మావోయిస్టులే బెటరని కితాబు ఇచ్చారు. మాధక ద్రవ్యల కట్టడి విషయంలో ఖమ్మం జిల్లా పోలీసుల పనితీరును డిజిపి పివి ఆనంద్ సైతం మెచ్చుకున్నారు. ఇదిలా ఉండగా పోలీసు కమిషనర్ సునిల్‌దత్ నేతృత్వంలో స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, ఈగల్ ఫోర్స్ బృందాలుగా ఏర్పాడి దాడులను తీవ్రం చేశారు. గడిచిన ఆరు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తాంగా 2 కోట్ల 24లక్షల రూపాయల విలువ చేసే 450 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వివిధ స్టేషన్లలో 55 కేసులు నమోదు కాగా 123 మంది విక్రయ, అక్రమ రవాణదారులను పట్టుకున్నారు. వారిపై పిడి యాక్ట్, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఛతీష్‌గడ్, బరిస్సా, ఆంధ్రప్రదేశ్ ల నుంచి ఖమ్మం మీదుగా గంజాయి రవాణను తరలించకుండా సరిహద్దులో నిఘా ఉంచారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపట్టి దొరికిన వారిని దొరికినట్లు అరెస్ట్ చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులను సమన్వయం చేసుకుంటూ సిక్రెట్ ఆపరేషన్లు నిర్వహించారు. అదేవవిధంగా గంజాయి రవాణా చేసే 20 మందిని, విక్రయించే 60 మందిని, వినియోగించే మరో 70 మందిని అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. గంజాయి మూలాలను పసిగట్టి వాటిని ఆదిలోనే అంతం చేసి గంజాయి రహిత జిల్లాగా ఖమ్మం ను తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. క్షేత్ర స్థాయిలో దాడులు చేస్తూ అనుమానం వచ్చిన వారిని విచారిస్తూ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఈగల్, టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రధానంగా యువత కదలికలపై కన్నెసి ఉంచాలని, వ్యాసనాలకు బానిస కాకుండా పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు కుటుంబ సభ్యులపై ఉందన్నారు. గంజాయి రవాణా, విక్రయాలు, సాగుచేస్తున్నా వారి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సిపి భరోసా ఇచ్చారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ కలిసిరావాలన్నారు. పోలీసు అధికారులు గ్రామాల్లో సందర్శించి ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలన్నారు. గంజాయిపై పక్కా సమాచారం దాడులకు దిగుతున్నామన్నారు. గంజాయి వాడుతున్న, సప్లెయి చేస్తున్న వారిని కనిపెట్టెందుకు తమ సిబ్బంది ప్రత్యేక పోలీసు బృందాలు మఫ్టిలో తిరుగుతూ నిల్వలను పట్టుకునేందుకు తిరుగుతున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలలు, లైబ్రరీలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

# జిల్లాలో 60 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ ఖమ్మం జిల్లాలో 60.89 శాతం పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా గత నెల 25 నుంచి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపట్టి నూరు శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 12,43,781 మంది ఓటర్లకు గాను వంద శాతం ఫారాలు అందజేసినట్లు తెలిపారు. ఇందు కోసం 1460 మంది బిఎల్‌వోలు పనిచేశారన్నారు. ఖమ్మం నియోజక వర్గంలో 355 మంది బిఎల్‌వోల ఆధ్వర్యంలో 3,28,203 మంది ఓటర్లకు, పాలేరు నియోజక వర్గంలో 291 మంది బిఎల్‌వోల ఆధ్వర్యంలో 245885 మంది ఓటర్లకు, మధిర నియోజక వర్గంలో 268 మంది బిఎల్‌వోల ఆధ్వర్యంలో 226126 మంది ఓటర్లకు, వైరా నియోజక వర్గంలో 252 మంది బిఎల్‌వోల ఆధ్వర్యంలో 196475 మంది ఓటర్లకు, సత్తుపల్లి నియోజక వర్గంలో 294 మంది బిఎల్‌వోల ఆధ్వర్యంలో 247192 మంది ఓటర్లకు గాను ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి స్థాయిలో అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఖమ్మం నియోజక వర్గంలో 151809 మంది ఓటర్లకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. పాలేరు నియోజక వర్గంలో 165810 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు, మధిర నియోజక వర్గంలో 143065 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు, వైరా నియోజక వర్గంలో 127841 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు సత్తుపల్లి నియోజక వర్గంలో 168789 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. సోమవారం వి. వెంకటాయపాలెంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ హన్మంతరావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ బానోత్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రతి నెలలో ఒక రోజు ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అన్నారు.

# ఖమ్మంలో ఈఎస్ఐ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలి

## ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లెమెంట్




ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కేంద్రంలో కార్మికుల కోసం ఈఎస్ఐ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి.క్లెమెంట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైరాలో రాయపూడి శ్రీను అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల పరిధిలో పనిచేస్తున్న దాదాపు 5లక్షల మంది సంఘటిత, అసంఘటితంగా కార్మికులకు ఉపయోగపడేలా జిల్లా కేంద్రంలో ఒక ఈఎస్ఐ హాస్పిటల్‌ను నిర్మించాలన్నారు. సంఘటిత రెండు లక్షల మంది పనిచేస్తుండగా అసంఘటిత రంగంలో 3లక్షలకు పైచిలుకు కార్మికులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ ఎస్ఐ హాస్పిటల్ లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో కేవలం డిస్పెన్సరీ మాత్రమే ఉందని, దానివలన ఎటువంటి ఉపయోగం లేదన్నారు. కార్మికులకు ఈఎస్ఐ కట్టడంలో కూడా యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. దాదాపు 6 నెలలు పాటు ఈఎస్ఐ జమ చేయకపోతే కార్మికుడికి తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. కనుక క్రమం తప్పకుండా ఈఎస్ఐ చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల వద్ద ఈఎస్ఐ పేరుతో డబ్బులు కట్ చేసుకొని జమ చెయ్యని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేలా ఈఎస్ఐ చట్టంలో మార్పులు చేయాలన్నారు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలు కార్మికులను ఇబ్బంది పెడుఉన్నారని ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలను అంటువ్యాధిలు తీవ్ర నష్టం చెకూరుతున్నాయని ఆయన వాపోయారు. కార్మికుడు ఆరోగ్యంగా ఉంటే రెట్టింపు పనిచేస్తాడని అందువలన ప్రభుత్వాలు, యాజమాన్యాలు కార్మికుడి ఆరోగ్యం గురించి పట్టించుకోవాలన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆగస్ట్ నెలలో మున్సిపల్ కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున పోరాటం చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర బాబు, ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.జాకిరుద్దీన్, గారపాటి అశో, దళిత హక్కుల పోరాట సంఘం నాయకులు యామాల గోపాలరావు, వైరా నాయకులు చింతల శ్రీను, కొండా రామకృష్ణ, పిడియాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ





ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ(ఆల్బెండాజోల్) మాత్రలను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, నాల్గో వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హర్ష, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, ఖమ్మం జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, దార్న రాజశేఖర్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, చెరుకూరి కిరణ్, వుంద్రు శ్యామ్‌బాబు, మచ్చా బుజ్జి, గాలి శ్రీనివాసరావు, మల్లు రామకృష్ణ, వేముల రత్నాకర్, పాలేటి నర్సింహారావు, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ నుంచి సాగునీటి విడుదల

**-గోదావరి జలాలతో రైతులకు ఊరట**
**-ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్**





ప్రజాపక్షం/వైరా: వైరా రిజర్వాయర్ లాకుల వద్ద నుంచి కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శనివారం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, నాల్గో వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణితో కలిసి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతనిధులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రైతుల అవసరాల దృష్టిలో ఉంచుకొని గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించి ప్రస్తుతం కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొనాఉ. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహకారంతో వైరా నియోజకవర్గంలో సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా నీటి పంపిణీని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గోదావరి జలాల తరలింపు, కాల్వల ద్వారా నీటి విడుదలతో వేలాది ఎకరాల్లో వరి, ఇతర పంటల సాగుకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, నీటిపారుదలశాఖ అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సేలం చంద్రశేఖర్‌రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, ఖమ్మం జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మచ్చా బుజ్జి, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, చెరుకూరి కిరణ్, వుంద్రు శ్యామ్‌బాబు, గాలి శ్రీనివాసరావు, మల్లు రామకృష్ణ, వేముల రత్నాకర్, పాలేటి నర్సింహారావు, తోటకూర శ్రీకాంత్, తెలుగుదేశం నాయకులు కిలారి సురేందర్, రామారావు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు అరుణోదయ నాగన్న



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : గత 50 ఏళ్లుగా విప్లవోద్యమంలో సాంస్కృతిక ఉద్యమ సారధిగా, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడిగా ప్రజలకు నాయకత్వం వహించిన అరణోదయ నాగన్న ఆదర్శప్రాయుడని న్యూడెమోక్రసీ కేంద్ర నాయకులు గాదె మాధవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దేవి చలపతిరావు అన్నారు. సోమవారం మండలంలోని రాజారం గ్రామంలో నాగన్న సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో అరుణోదయ కళాకారులతో కోలాటం, డప్పు నృత్యాలతో ప్రదర్శన నిర్వహించారు. బొడ్రాయి సెంటర్లో శ్రీపాద శ్రీహరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మందుల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భూస్వాములు, పెత్తందారులుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రాష్ట్ర అగ్ర నాయకులతో పాటు నాగన్న పాల్గొన్నారని తెలిపారు. కానూరి తాత, అరుణోదయ రామారావు, నాగన్నలు విప్లయ గేయాలతో బుర్రకథలతో ఆంధ్రాలోకాన్ని ఈ అగ్ర అరుణోదయ కళాకారులు లేని లోటును నేటి యువ కళాకారులు తీర్చాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరు మధు, పిఓడబ్ల్యు జాతీయ నాయకురాలు గాదె ఝాన్సీ, అఖిలభారత కూలీ సంఘం ఎఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల చంద్రారెడ్డి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, అరుణోదయ సాంస్కృతి సమైక్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఉదయగిరి అరుణోదయ జిల్లా అధ్యక్షులు పోలేపొంగు నాగయ్య, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, జిల్లా నాయకులు కోలా లక్ష్మి నారాయణ, సురేష్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.